RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

వరంగల్ | బుధవారం | పేజీలు : 6
సంపుటి : 4, సంచిక : 27 | డిసెంబర్ 31, 2025 | వెల : రూ.3-00

దినపత్రిక



4లో..

## దుర్గం చెరువు ఆక్రమణలపై ఉక్కుపాదం

# హద్దు మీరొద్దు!

- ☐ ఖాకీల చక్రవ్యూహంలో భాగ్యనగరం
- ☐ మత్తుపై ఉక్కుపాదం..రోడ్లపై డేగ కన్ను..
- ☐ ఫామ్ హౌస్, రిసార్ట్ లపై ప్రత్యేక నిఘా
- ☐ పోకిరీలపై కన్నేయనున్న షీటీమ్స్
- ☐ డ్రంక్ అండ్ డ్రైవ్.. బైక్ స్టంట్లు చేస్తే కటకటాలే
- ☐ న్యూ ఇయర్ వేడుకలపై కఠిన ఆంక్షలు
- ☐ ఒక్క రోజు ఆర్భాటానికి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు
- ☐ యువతకు తెలంగాణ పోలీసుల వార్నింగ్




**వేద న్యూస్, క్రైం బ్యూరో:**

మరో కొన్ని గంటల్లో 2025 కాలగర్భంలో కలవబోతోంది. 2026కి స్వాగతం పలికే ఉత్సాహంలో ప్రపంచం ఊగుతోంది. అయితే, ఈ వేడుకల ఉత్సాహం ఉన్మాదంగా మారకుండా తెలంగాణ పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. డిసెంబర్ 31.. ఆనందానికి, ఉత్సాహానికి ప్రతీకగా మారిన ఈ ఒక్క రాత్రి గతంలో ఎన్నో విషాదాలకు కారణమైంది. మద్యం మత్తు, డ్రగ్స్, రోడ్డు ప్రమాదాలు, మహిళల పట్ల అసభ్య ప్రవర్తన.. న్యూ ఇయర్ వేడుకల పేరుతో జరిగే ఈ అఘాయిత్యాలు ప్రతి ఏటా పోలీసులకు సవాల్‌గా మారుతున్నాయి. ఉత్సవాల ఉన్మాదం చట్టాన్ని దాటకుండా ఉండాలనే లక్ష్యంతో తెలంగాణ పోలీసు యంత్రాంగం ఈసారి కట్టుదిట్టంగా భద్రతా చక్రవ్యూహాన్ని అమల్లోకి తెచ్చింది. 'డ్రగ్స్ ఫ్రీ న్యూ ఇయర్' అజెండాతో రాష్ట్రవ్యాప్తంగా కట్టుదిట్టమైన ఆంక్షలు, నిఘా, హెచ్చరికలు చేశారు. నూతన సంవత్సర రాత్రి శాంతి భద్రతలే లక్ష్యంగా పోలీసుల పటిష్ట కార్యాచరణ మొదలైంది. పబ్స్, ఫామ్ హౌజ్‌లపై నిఘా నీడను కట్టుదిట్టం చేసింది. డ్రంక్ అండ్ డ్రైవ్ మొదలుకొని షీ టీమ్స్ నిఘా వరకు.. ఈసారి నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరిస్తోంది. నూతన సంవత్సర వేళ ప్రత్యేక కథనం మీకోసం..

3లో..

## హింసా రాజకీయాలు హద్దులు దాటాయి

- అమిత్ షా
- 300 మందికిపైగా బీజేపీ కార్యకర్తల హత్యలు
- 3 వేల మందికి పైగా గ్రామాలకు తిరిగి వెళ్లలేని పరిస్థితి
- టీఎంసీ జెండా మోసితేనే జీవించనిస్తామనే ఒత్తిడి




**న్యూఢిల్లీ, వేద న్యూస్ :**


కమ్యూనిస్టులు ఓడిపోయిన తర్వాత పశ్చిమ బెంగాల్‌లో హింస, ప్రతీకార రాజకీయాలు ముగుస్తాయని భావించామని, కానీ అవే ఇప్పుడు మరింత తీవ్రమయ్యాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు చేశారు. కమ్యూనిస్టులను మించి ప్రస్తుతం అధికారంలో ఉన్నవారు హింసా రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటి వరకు పశ్చిమ బెంగాల్‌లో మూడు వందల మందికిపైగా భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు హత్యకు గురయ్యారని అమిత్ షా తెలిపారు. రెండు వేల ఇరవై ఒకటి ఎన్నికల తర్వాత కూడా మూడు వేల మందికిపైగా బీజేపీ కార్యకర్తలు

మిగతా 3వ పేజీలో..

## జర్నలిస్టులను విభజించే ఉద్దేశం లేదు

- అక్రిడిటేషన్ కార్డులు, మీడియా కార్డుల మధ్య ఎలాంటి తేడా లేదు
- జీఓ 252కి అవసరమైన సవరణలు చేస్తాం
- అసెంబ్లీ సమావేశాల అనంతరం అన్ని సంఘాలతో సంప్రదింపులు
- జర్నలిస్టులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**



అక్రిడిటేషన్ కార్డులు, మీడియా కార్డుల మధ్య ఎలాంటి తేడా లేదని, అక్రిడిటేషన్ కార్డుదారులకు వర్తించే అన్ని ప్రయోజనాలు మీడియా కార్డుదారులకు కూడా సమానంగా వర్తిస్తాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, డెస్క్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో మంత్రి ఈ విషయాన్ని వెల్లడించారు. జర్నలిస్టులను విభజించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని మంత్రి తెలిపారు. నిజమైన, అర్హులైన జర్నలిస్టుల పక్షానే ప్రభుత్వం నిలుస్తుందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని, ఎవరికీ అన్యాయం జరగనివ్వబోమని హామీ ఇచ్చారు. జీఓ 252కు సంబంధించి అవసరమైన సవరణలను అన్ని జర్నలిస్టు సంఘాలతో, ముఖ్యంగా డెస్క్ జర్నలిస్టులతో సంప్రదింపులు జరిపిన అనంతరం రాతపూర్వకంగా చేస్తామని మంత్రి ప్రకటించారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. జర్నలిస్టుల వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నేను మీతోనే ఉన్నాను.. అని మంత్రి జర్నలిస్టులకు భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల హక్కులు, గౌరవం, భద్రతను కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని మరోసారి స్పష్టం చేశారు.

## కోర్ ఏరియా క్లీన్ అప్ షురూ

- హైదరాబాద్‌ను 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్వ్యవస్థీకరణ
- జోనల్ కమిషనర్లకు ఐదేళ్ల కార్యాచరణపై సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశం
- చెత్త, కాలుష్యం, ఆక్రమణలపై జీరో టాలరెన్స్ విధానం

3లో..

# వైకుంఠ రామా..!

- ఉత్తర ద్వారంలో దర్శనమచ్చిన భద్రాద్రి రాముడు తిలకించి పులకించిన భక్తజనం
- వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు
- రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా హాజరైన భక్తులు పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు




**వేద న్యూస్, భద్రాచలం:**

దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన భద్రాచలంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు ఆధ్యాత్మిక వైభవోపేతంగా, భక్తుల హృదయాలను ఉప్పొంగించేలా ఘనంగా నిర్వహించబడ్డాయి. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహించారు. వైకుంఠ రాముడిగా అలంకరించబడిన స్వామివారి దివ్య దర్శనంతో భక్తులు పరవశించి, "శ్రీరామ జయ రామ జయ జయ రామ" నామస్మరణలతో భద్రాద్రి క్షేత్రం మారుమోగింది. ఉత్తర ద్వార దర్శనానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో వీవీఐపీ, వీఐపీ సెక్టార్లతో పాటు సాధారణ భక్తుల కోసం ప్రత్యేక సెక్టార్లు ఏర్పాటు చేశారు. వేదపండితులు ముక్కోటి ఏకాదశి విశిష్టతను వివరించగా, అర్చకులు 108 ఒత్తులతో మహా హారతి నిర్వహించారు. అనంతరం ఉత్తర ద్వారం ద్వారా దర్శనం అనంతరం ఉత్సవ మూర్తులను మాడ వీధుల్లో భక్తిశ్రద్ధల మధ్య ఊరేగించారు.

**వైకుంఠ రాముడి విశేష అలంకారాలు..**

ఈ సందర్భంగా స్వామివారు గరుడ వాహనరూపుడిగా శ్రీమహావిష్ణు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరామ పదాక్షరీ మంత్ర సంపుటిత అష్టోత్తర శతనామార్చన, చతుర్వేద పఠనం, గరుడ ప్రబంధాలు, ఇతిహాస పఠనం, భక్త రామదాసు రచించిన దాశరథి శతక పఠనం


మిగతా 3వ పేజీలో..

## సీఎం రేవంత్ రెడ్డి శ్రీవారి దర్శనం

- వైకుంఠ ఏకాదశి పర్వదినాన వెంకన్న సన్నిధికి

**వేద న్యూస్, తిరుమల ప్రతినిధి:**

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా తిరుమలలోని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. పవిత్రమైన ఈ ప్రత్యేక రోజున శ్రీవారి వైకుంఠ ద్వారం గుండా ప్రవేశించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారి దర్శనం అనంతరం ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ఆచారాలను పాటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజల సంక్షేమం, శాంతి, సమృద్ధి కోసం శ్రీవారిని ప్రార్థించినట్లు సమాచారం. వైకుంఠ ఏకాదశి రోజున తిరుమలలో భక్తుల సందడి నెలకొనగా, భద్రతా ఏర్పాట్ల మధ్య సీఎం దర్శనం ప్రశాంతంగా ముగిసింది. వైకుంఠ ఏకాదశి హిందూ సంప్రదాయాల్లో అత్యంత పవిత్రమైన రోజుగా భావిస్తారు. ఈ రోజున శ్రీవారి దర్శనం చేసుకుంటే మోక్షప్రాప్తి కలుగుతుందనే విశ్వాసంతో దేశం నలుమూలల నుంచి భక్తులు తిరుమలకు తరలివచ్చారు. ముఖ్యమంత్రి దర్శనంతో ఈ పర్వదినానికి మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.



# సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి

**– కాసిపేట మండలంలో నూతన సర్పంచులకు సన్మానం**



**వేద న్యూస్, కాసిపేట:**

గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ అన్నారు. మంచిర్యాల జిల్లా కాసిపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఇటీవల ఎన్నికైన నూతన సర్పంచులకు మండల పరిషత్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కాసిపేట మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో 22 గ్రామ పంచాయతీలకు చెందిన నూతన సర్పంచులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ మాట్లాడుతూ.. గ్రామ పరిపాలనలో సర్పంచుల పాత్ర కీలకమని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాల అభివృద్ధి వేగవంతమవుతుందని పేర్కొన్నారు. తహసీల్దార్ సునీల్ కుమార్ దేశ్‌పాండే, ఎంపీవో షేక్ సఫ్దర్ అలీలు మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పారిశుధ్యం, తాగునీరు, రహదారులు, వీధిదీపాలు, ఉపాధి హామీ పనులు, గ్రామాభివృద్ధి ప్రణాళికల అమలులో సమిష్టి కృషి అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులను సన్మానించారు. అనంతరం ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో షేక్ సఫ్దర్ అలీలను సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ లక్ష్మయ్య, సీనియర్ అసిస్టెంట్ ఆకుల లక్ష్మీనారాయణ, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి, ఏవో చల్ల ప్రభాకర్, పీఆర్ ఏఈ జగన్, ఏపీఎం రాజ్‌కుమార్‌తో పాటు ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

# నూతన సర్పంచ్ కు అభినందనలు




**వేద న్యూస్, కాసిపేట :**

సోమగూడెం (కే) గ్రామపంచాయతీ నూతన సర్పంచ్‌గా చైతన్య ప్రవీణ్ నాయక్ ఎన్నికైన సందర్భంగా చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సోమగూడెం (కే) గ్రామపంచాయతీలో నివాస ముంటున్న సింగరేణి కార్మికుడు, గిరిజన ఉద్యోగుల సంఘం మందమర్రి ఏరియా సెక్రటరీ, చేయూత స్వచ్ఛంద సంస్థ ఉపాధ్యక్షుడు భుక్య ప్రవీణ్ నాయక్ సతీమణి చైతన్య ప్రవీణ్ నాయక్ ఇటీవల సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో చైతన్య ప్రవీణ్ నాయక్‌ను శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న సింగరేణి సీనియర్ సర్వే ఆఫీసర్ పందిళ్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. కేకే ఉపరితల గని ప్రభావిత ప్రాంతమైన సోమగూడెం (కే) గ్రామపంచాయతీని బెల్లంపల్లి ఎమ్మెల్యే సహకారంతో, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కృషితో సింగరేణి నిధుల ద్వారా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఉత్తమ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. గ్రామాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారంలో సర్పంచ్ పాత్ర కీలకమని పేర్కొన్న ఆయన, ప్రజల సహకారంతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా నిలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆడెపు రవీందర్, ప్రధాన కార్యదర్శి అంకం రాయమల్లు, చైర్మన్ విజయ్, అసిస్టెంట్ చైర్మన్లు కాండ్రపు రవి, జూల పోషం, కస్తూరి సందీప్ పాల్గొన్నారు. అలాగే సర్వే మజ్దూర్లు దాగం ఆనంద్, మోహన్, కుమారస్వామి, దువ్వల ప్రవీణ్, బండి గణేష్, మేకల ఆంజనేయులు, షకీల్ తదితరులు పాల్గొని నూతన సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# శివరాత్రికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు

**– అన్ని శాఖలు కలిసి పనిచేయాలి**
**– విప్ ఆది శ్రీనివాస్, ఇన్ చార్జ్ కలెక్టర్ గరిమ అగ్రవాల్**





**వేద న్యూస్, వేములవాడ:**

మహా శివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14, 15, 16 తేదీల్లో నిర్వహించనున్న మహా శివరాత్రి జాతర నేపథ్యంలో మంగళవారం వేములవాడలోని భీమేశ్వర సదన్‌లో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్పీ మహేష్ బీ గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులు భీమేశ్వర ఆలయంలో సులభంగా, వేగంగా దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రోడ్ల మరమ్మత్తులు, పారిశుధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు, బస్సు సౌకర్యాలు పక్కా ప్రణాళికతో అమలు చేయాలని ఆదేశించారు. తిప్పాపూర్ బస్టాండ్‌లో హెల్ప్ డెస్క్‌లు, సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, పార్కింగ్ ప్రాంతాల్లో తాగునీరు, మజ్జిగ, అల్పాహారం సదుపాయాలు కల్పించాలని సూచించారు. వైద్య బృందాలు, ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు, ఫుడ్ సేఫ్టీ తనిఖీలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్ చైర్లు, వాలంటీర్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. జాతర సందర్భంగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని ఎస్పీ మహేష్ బీ గితే తెలిపారు. వీఐపీ దర్శనాలు, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ రుత్విక్ సాయి, ఆర్డీఓ రాధాబాయి, ఆలయ ఈఓ రమాదేవి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితర అధికారులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ చిన్న తప్పు కాదు

**– ఎస్సై అశోక్ కుమార్**




**వేద న్యూస్, ఇల్లంతకుంట :**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలో డిసెంబర్ 31 రాత్రి పలుచోట్ల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నట్లు మండల ఎస్సై సిరిసిల్ల అశోక్ కుమార్ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ అనేది చిన్న తప్పు కాదని, ఇతరుల ప్రాణాలతో ఆడుకునే ప్రమాదకరమైన నేరమని ఆయన స్పష్టం చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల అనేక కుటుంబాలు అనాథలవుతున్నాయని, అలాంటి ఘటనలను అరికట్టడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఇకపై ఎవరి పేర్లు, సిఫారసులు పనిచేయవని, ఈ విషయంలో ఎలాంటి జోక్యాన్ని సహించబోమని ఆయన హెచ్చరించారు. నూతన సంవత్సరాన్ని అందరూ తమ కుటుంబ సభ్యులతో సంతోషంగా, భద్రంగా జరుపుకోవాలని సూచించిన ఎస్సై, ప్రజల ప్రాణభద్రతే పోలీసుల ప్రథమ బాధ్యత అని తెలిపారు. డిసెంబర్ 31న డీజేలు ఏర్పాటు చేయడం, బాణాసంచా పేల్చడం నిషేధమని, పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున బహిరంగంగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరిన ఎస్సై సిరిసిల్ల అశోక్ కుమార్, మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# ఇందిరమ్మ చీరెలు పంపిణీ




**వేద న్యూస్, టేక్మాల్:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్య క్రమం టేక్మాల్ మండలం పరధిలోని వేల్పు గొండ గ్రామ పంచాయతీ భవనంలో సర్పంచ్ నిరుడి దాస్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రాష్ట్ర మహిళల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేసేలా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలంటే అవ కాశాలను సద్వినియోగం చేసుకోవాలని, గ్రామాన్ని అభివృద్ధి పరుచాలనే దృఢ సంకల్పంతో కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ రాఘవేందర్, ఉపసర్పంచ్ ఎంపీ సుధాకర్, వీవోఏ అబ్బని రాములు గ్రామ వెలుగు సమైక్య సంఘం సభ్యురాలు ఆవుసుల పద్మ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ల ఫోరమ్ రాష్ట్ర కార్యదర్శిగా అవినాష్ కుమార్



**వేద న్యూస్ టేక్మాల్:**

మెదక్ జిల్లా టేక్మాల్ మండల్ పరిధిలోని బొడ్మాట్ పల్లి సర్పంచ్ తలారి అవినాష్ కుమార్ రాష్ట్ర సర్పంచుల సంఘం నూతన కార్యవర్గంలో మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల కార్యదర్శిగా చోటు దక్కింది. నియామక పత్రాన్ని రాష్ట్ర సర్పంచుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షు సౌధాని భూమన్న యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు కథాయి ఆశాదీప్ రెడ్డి, చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా తలారి అవినాష్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నరసింహకు పంచాయతీరాజ్ మంత్రి సీతక్క, టేక్మాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నిమ్మ రమేష్, మండల కాంగ్రెస్ కమిటీకి, గ్రామ కమిటీ అధ్యక్షుడు శంకరప్పకు, బొద్మాట్ పల్లి గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర సర్పంచుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా అడుగులు వేస్తామని గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు.

# ఘనంగా అయ్యప్ప పడిపూజ



**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండల కేంద్రంలోని మత్స్యగిరి స్వామి దేవాలయంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్, గురు స్వామి సామల బిక్షపతి 27వ స్వామి మాలాధారణ సందర్భంగా మంగళవారం నారికేలి అయ్యప్ప పూజలను ఘనంగా నిర్వహించారు. వేదమంత్రాల నడుమ గణపతి, కుమారస్వామి, లక్ష్మీదేవి, అయ్యప్ప స్వామి అష్టోత్తరాలతో శరణు ఘోషతో పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వాములు శ్రీరామోజు ప్రదీప్ కుమార్, కందగట్ల రమేష్, నామని శివ, గొట్టిముక్కల రామ్మూర్తి, సామల నాగరాజు, వనం విశాల్, వినుకొండ రాజకుమార్, ఉప్పు నరసయ్య, భాషని బాలకృష్ణ, కొత్తపెల్లి రవీందర్, మార్త సుమన్, గట్టు కిషన్, గోరంట్ల ప్రశాంత్‌తో పాటు ఆత్మకూరు, పత్తిపాక, ఆరేపల్లి ప్రాంతాల స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

# క్రికెట్ లీగ్ టోర్నమెంటులోఎంఎంసిఏ రైడర్స్ గెలుపు



**వేద న్యూస్, బెల్లంపల్లి :**

బెల్లంపల్లి పట్టణంలోని ఏ.ఎం.సీ మైదానంలో నిర్వహించిన క్రికెట్ లీగ్ టోర్నమెంటులో ఎం.ఎం.సీ.ఏ రైడర్స్ జట్టు గెలుపొందింది. ఫైనల్ పోటీలో ఎం ఎం సి ఏ రైడర్స్ జట్టు ఎం ఎం సి ఏ బ్లాస్టర్ జట్టును ఓడించింది. 18 ఓవర్ల మ్యాచ్ లో ముందుగా బ్యాటింగ్ చేసిన బ్లాస్టర్స్ జట్టు 16 ఓవర్లలో 93 పరుగులు చేసి ఆల్ అవుట్ కాగా రైడర్స్ జట్టు 16 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 94 పరుగులు చేసి విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా అభి,మ్యాన్ ఆఫ్ ది సిరీస్ గా శ్రీకాంత్ ఎంపిక అయ్యాడు. బెస్ట్ బౌలర్ గా చందు, బెస్ట్ బ్యాట్స్ మెన్ గా నవం ఎంపికయ్యారు.విజేతలకు సోమవారం రాత్రి కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు బహుమతులను అందజేశారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ నాయకులు నాతరి స్వామి మాట్లాడుతూ క్రికెట్ విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడలకు తమ పార్టీ తగిన విధంగా ప్రోత్సాహం అందిస్తుందన్నారు. బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ముచ్చర్ల మల్లయ్య మాట్లాడుతూ బెల్లంపల్లిలో క్రికెట్ అభివృద్ధి కోసం మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ ఎంతగానో కృషి చేస్తున్నదని ప్రశంసించారు. ప్రస్తుతం అద్దె స్థలంలో నిర్వహిస్తున్న అకాడమీకి ఎమ్మెల్యే తో సంప్రదించి తగిన ప్రభుత్వ స్థలాన్ని అందించడానికి కృషి చేస్తామన్నారు. ఈ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో కెరీర్ గ్రూపు చైర్మన్ గడ్డం రాజేష్ గౌడ్ తెలంగాణ క్రికెటర్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు పైడిమల్ల నర్సింగ్, కో ఆర్డినేటర్ అల్లం వెంకటేశ్వర్లు, ఎస్ జి ఎఫ్ జోనల్ సెక్రెటరీ గోపాల్, ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్,పి.డి బాబురావు, క్రికెట్ అకాడమీ కోచ్ డేవిడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఎంపైర్లుగా గౌతం,హరీష్,దుర్గయ్య కామెంటేటర్ గా దినేష్ వ్యవహరించారు.

# బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

**– పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు**
**– ఆపరేషన్ స్మైల్ విజయవంతం చేయాలి**
**– మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు**




**వేద న్యూస్, మెదక్ జిల్లా:**

ప్రమాదకరమైన ప్రాంతాల్లో పని చేస్తున్న పిల్లలను, తప్పిపోయిన పిల్లలను గుర్తించి రక్షించడం, వారికి పునరావాసం కల్పించడం, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ఆపరేషన్ స్మైల్ అని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ స్మైల్-12 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ శాఖల సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఈ లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పరిశ్రమలు, వ్యాపార సముదాయాల్లో ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించి, పిల్లలను పనిలో పెట్టుకునే యజమానులపై కేసులు నమోదు చేసి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన పిల్లలను వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించాలని, తల్లిదండ్రులకు అవసరమైన కౌన్సెలింగ్ అందించాలని, అనాథ పిల్లలను కేర్ హోమ్‌లకు తరలించే ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా 1098 కు సమాచారం ఇవ్వాలని, లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ప్రజలను కోరారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ప్రతి ఏటా జనవరి 1 నుండి జనవరి 31 వరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో, వివిధ శాఖల అధికారుల సమన్వయంతో నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి అవసరమైన ప్రణాళికను ఇప్పటికే సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. పిల్లలతో పనిచేసే అవకాశాలు ఉన్న పరిశ్రమలు, హెూటళ్లు, వ్యాపార సముదాయాలు, గోదాములు, ఇటుక బట్టీలు, మెకానిక్ షాపులు తదితర ప్రాంతాల్లో వ్యూహాత్మక తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీఓ జయచంద్ర రెడ్డి, జిల్లా డీడబ్ల్యూఓ హైమావతి, చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ నుంచి ఉప్పలయ్య, లేబర్ డిపార్ట్‌మెంట్ డీసీపీవో సత్యేంద్ర ప్రసాద్, హెల్త్ డిపార్ట్మెంట్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# హద్దు మీరొద్దు!




- ☐ ఖాకీల చక్రవ్యూహంలో భాగ్యనగరం
- ☐ మత్తుపై ఉక్కుపాదం..రోడ్లపై డేగ కన్ను..
- ☐ ఫామ్ హౌస్, రిసార్ట్ లపై ప్రత్యేక నిఘా
- ☐ పోకిరీలపై కన్నేయనున్న షీటీమ్స్
- ☐ డ్రంక్ అండ్ డ్రైవ్.. బైక్ స్టంట్లు చేస్తే కటకటాలే
- ☐ న్యూ ఇయర్ వేడుకలపై కఠిన ఆంక్షలు
- ☐ ఒక్క రోజు ఆర్భాటానికి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు
- ☐ యువతకు తెలంగాణ పోలీసుల వార్నింగ్

**వేద న్యూస్, క్రైం బ్యూరో:**

డిసెంబర్ 31... నూతన సంవత్సరానికి స్వాగతం పలికే ఈ ఒక్కరోజు వేడుకలు ఎలాంటి విషాదాలకు దారి తీస్తాయో గత అనుభవాలు స్పష్టంగా చూపిస్తున్నాయి. మరో కొన్ని గంటల్లో 2025 సంవత్సరం కాలగర్భంలో కలిసిపోనుంది. కొత్త ఆశలు, ఆశయాలతో 2026 సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ప్రపంచం సిద్ధమవుతోంది. అయితే, ఈ వేడుకల ఉత్సాహం ఉన్మాదంగా మారకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా తెలంగాణ రాష్ట్ర పోలీసు యంత్రాంగం ముందస్తుగా చక్ర వ్యూహం సిద్ధం చేసింది. డ్రగ్స్, మద్యం మత్తు, రోడ్లపై అల్లర్లు, మహిళల పట్ల అసభ్య ప్రవర్తన, ప్రమాదకర డ్రైవింగ్... ఇవన్నీ న్యూ ఇయర్ నైట్‌కు విడదీయరాని అంశాలుగా మారుతున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో ఈసారి తెలంగాణ పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా అత్యంత కట్టుదిట్టమైన చర్యలకు శ్రీకారం చుట్టింది. హైదరాబాద్ నగరం కేంద్రంగా మాత్రమే కాకుండా జిల్లా కేంద్రాలు, పట్టణాలు, గ్రామాల వరకూ విస్తృత స్థాయిలో బందోబస్తు ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 31 రాత్రి అత్యంత కఠినమైన ఆంక్షలు అమలులోకి రానున్నాయి. ఈ ఏడాది పోలీసుల ప్రధాన అజెండా 'డ్రగ్స్ ఫ్రీ న్యూ ఇయర్'. వేడుకల ముసుగులో యువతను మత్తుకు బానిస చేయాలని చూసే ముఠాల పట్ల ప్రభుత్వం సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరోతో కలిసి సిటీ పోలీసులు ప్రత్యేక ఆపరేషన్లు మొదలుపెట్టారు. పబ్స్, క్లబ్‌లు, ఫామ్ హౌజ్ లలో జరిగే ఈవెంట్స్ పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

**– ఫామ్ హౌసులు,, రిసార్టులపై నిఘా..**

సిటీకి దూరంగా ఉండే ఫామ్ హౌస్‌లు, ప్రైవేట్ విల్లాలు, రిసార్టులపై నిఘా ఉంచడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఎక్కడైనా డ్రగ్స్ వాడినట్లు తేలితే యాజమాన్యంతో పాటు పార్టీకి వచ్చిన ప్రతి ఒక్కరిపై కఠినమైన కేసులు నమోదు చేస్తారు. మాదకద్రవ్యాలను గుర్తించడంలో నిపుణత ఉన్న డాగ్ స్క్వాడ్స్‌ను ప్రధాన ఈవెంట్ సెంటర్ల వద్ద మోహరించనున్నట్లు సమాచారం. నగర శివార్లలోని మొయినాబాద్, శంషాబాద్, ఘటకేసర్ వంటి ప్రాంతాల్లోని ఫామ్ హౌస్‌లే లక్ష్యంగా పోలీసులు పటిష్ట నిఘా పెంచారు. ముఖ్యంగా అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉండే ఫామ్ హౌస్‌లలో జరిగే కార్యకలాపాలను పర్యవేక్షించడానికి కట్టదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

**– నిబంధనలు అతిక్రమిస్తే..**

ఫామ్ హౌస్‌లలో ఈవెంట్స్ నిర్వహించాలంటే పోలీసుల ముందస్తు అనుమతి తప్పనిసరి. నిబంధనలు అతిక్రమిస్తే ప్రాంగణాలను సీజ్ చేయడమే కాకుండా భారీ జరిమానాలు విధిస్తారు. డిసెంబర్ 31 రాత్రి వేడుకలు కేవలం ప్రభుత్వం నిర్దేశించిన సమయం వరకు మాత్రమే కొనసాగాలి. డీజేల హోరు నిర్ణీత డెసిబుల్స్ దాటకూడదు. సౌండ్ పొల్యూషన్ నిబంధనలు ఉల్లంఘిస్తే సౌండ్ సిస్టమ్స్‌ను సీజ్ చేస్తారు. మద్యం సరఫరా చేసే ప్రాంతాల్లో 21 ఏళ్ల లోపు వారికి ప్రవేశం కల్పిస్తే యాజమాన్యంపై లైసెన్స్ రద్దు చర్యలు ఉంటాయి.

**– రోడ్లపై మృత్యుపాశం..**

న్యూ ఇయర్ రాత్రి రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. గతంలో 31రాత్రి విపరీతంగా తాగి ప్రమాదాలకు గురైన సంఘటనలు కోకొల్లు.. ఎంతమంది చనిపోయారు కూడా.. మరెంతో మంది గాయపడి ఇప్పటికీ ఆ విషాదాన్ని అనుభవిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈసారి పోలీసులు రోడ్లపై మృత్యుపాశాన్ని అరికట్టేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నారు. రాత్రి 10 గంటల నుండి ఉదయం 5 గంటల వరకు నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కట్టుదిట్టంగా చేపట్టనున్నట్లు పోలీసులు ప్రకటించారు. నగరవ్యాప్తంగా 150కి పైగా పాయింట్ల వద్ద బ్రీత్ అనలైజర్ తనిఖీలు ఉంటాయి. మద్యం తాగి వాహనం నడిపితే భారీ జరిమానాతో పాటు 6 నెలల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే డ్రైవింగ్ లైసెన్స్‌ను కనీసం 3 నెలల పాటు సస్పెండ్ చేయాలని ఆర్టీఏ అధికారులకు పోలీసులు సిఫార్సు చేస్తారు. అంతేకాదు అన్ని జిల్లా కేంద్రాల్లో కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టనున్నారు.

**– రంగంలోకి 'షీ టీమ్స్'**

మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే 'రోమియోల'కు చెక్ పెట్టేందుకు షీ టీమ్స్ రంగంలోకి దిగనున్నాయి. ఈవెంట్స్, పబ్స్, రద్దీగా ఉండే మెయిన్ రోడ్లపై షీ టీమ్స్ సభ్యులు మఫ్టీలో తిరుగుతారు. ఎవరైనా మహిళలను వేధించినా, దురుసుగా ప్రవర్తించినా తక్షణమే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తారు. ఆపదలో ఉన్న మహిళలు తక్షణ సహాయం కోసం పకడ్బందీ చర్యలు చేపట్టారు.

**– యువతకు పోలీసుల వార్నింగ్**

ఒక్క రాత్రి ఎంజాయ్‌మెంట్ కోసం మీ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు.. అని పోలీసులు యువతను హెచ్చరిస్తున్నారు. డ్రగ్స్, డ్రంక్ అండ్ డ్రైవ్ లేదా గొడవల్లో పాల్గొని క్రిమినల్ కేసులు నమోదైతే.. భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు, విదేశీ వీసాలు, పాస్‌పోర్ట్ క్లియరెన్స్ రావడం కష్టమవుతుంది. సైలెన్సర్లు తొలగించి రోడ్లపై విన్యాసాలు చేయడం, అతివేగంతో డ్రైవింగ్ చేయడం వంటివి చేస్తే వాహనాలను శాశ్వతంగా సీజ్ చేసే అవకాశం ఉంది. కాబట్టి 2025కి సంతోషంగా వీడ్కోలు పలికి, 2026కి బాధ్యతాయుతంగా స్వాగతం పలకండి. మద్యం సేవించి వాహనాలు నడపకండి. క్యాబ్ సర్వీసులు లేదా డ్రైవర్లను ముందుగానే ఏర్పాటు చేసుకోండి. మీ భద్రతే మా ప్రాధాన్యత.. అంటూ నగర ప్రజలకు పోలీసులు సూచిస్తున్నారు.

# వైకుంఠ రామా..!

తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను మంత్ర ముగ్ధులను చేశాయి. భక్తరామదాసు కాలం నుంచీ కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్ మూలవిరాట్టులకు స్నపన కార్యక్రమం నిర్వహించారు.

**శోభాయమానంగా వేడుకలు**


ఉత్తర ద్వార దర్శనం అనంతరం వైకుంఠరాముడు తిరువీధి సేవకు బయలుదేరారు. చలువ చప్పర వాహనంపై పెరియాళ్వార్, నమ్మాళ్వార్, మరో వాహనంపై అండాళ్ అమ్మవారు, హనుమత్ వాహనంపై లక్ష్మణస్వామి, గజవాహనంపై సీతమ్మవారు, గరుడ వాహనంపై శ్రీ సీతారామచంద్రమూర్తుల తిరువీధి సేవ మేళతాళాలు, భాజాభజంత్రీలు, వేద మంత్రోచ్చారణల మధ్య అత్యంత వైభవంగా సాగింది. రాపత్తు ఉత్సవాలతో వేడుకలు మరింత శోభను సంతరించుకున్నాయి.

**అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు**

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రతి సెక్టార్‌లో ఏర్పాట్ల పర్యవేక్షణకు జిల్లా అధికారులు, లైజన్ అధికారులను నియమించారు. బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ స్వయంగా పర్యవేక్షించారు. ఈ వేడుకలకు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐటీడీఏ పీవో రాహుల్, ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఏఎస్పీ విక్రాంత్ సింగ్, దేవస్థానం ఈఓ దామోదర్ రావు, భద్రాచలం సర్పంచ్ పూనం కృష్ణదొర తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై స్వామివారి దర్శనం చేసుకున్నారు.

# ఆరుగురు ఐఏఎస్‌లు బదిలీ..

**నల్గొండ వేద న్యూస్ :**



కొత్తగా నాలుగు కమిషనరేట్ల ఏర్పాటుతో సోమవారమే సీనియర్ ఐపీఎస్‌ల బదిలీలు చేపట్టిన ప్రభుత్వం ఐఏఎస్‌లను ట్రాన్స్‌ఫర్ చేసింది. ఆరుగురు ఐఏఎస్‌లకు స్థాన చలనం కల్పించింది. జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్‌గా ఇ.సృజన. టి. వినయ్ కష్ణా రెడ్డి బదిలీ అయ్యారునల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నిజామాబాద్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. నల్గొండ కలెక్టర్‌గా బడుగు చంద్రశేఖర్, నారాయణపేట అడిషనల్ కలెక్టర్‌గా ఉమాశంకర్ ప్రసాద్, అదిలాబాద్ జాయింట్ కమిషనర్‌గా వై.శ్రీలీల, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్‌గా శృతి ఒఝా నియమితులయ్యారు.

# హింసా రాజకీయాలుహద్దులు దాటాయి

తమ సొంత గ్రామాలకు తిరిగి వెళ్లలేని పరిస్థితి నెలకొని ఉందని అన్నారు. తమ గ్రామాల్లో నివసించాలంటే అధికార పార్టీ జెండా మోసుకోవాలనే విధంగా ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితి ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పుగా మారిందని అమిత్ షా వ్యాఖ్యానించారు. రాజకీయ భిన్నాభిప్రాయాల పేరుతో హింస, భయాందోళనలకు పాల్పడడం సరికాదని, దేశం ఇలాంటి రాజకీయాలను అంగీకరించదని స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో నెలకొన్న పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకి తమ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తపరిచే హక్కు ఉందని, ఆ హక్కును కాలరాసే ప్రయత్నాలను బీజేపీ ఎప్పటికీ సహించదని అమిత్ షా స్పష్టం చేశారు. రాజకీయ హింసకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు.

# కోర్ ఏరియా క్లీన్ అప్ షురూ

**హైదరాబాద్,వేద న్యూస్ :**



ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ ఏరియా (సీయూర్)లో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి సాధించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు హైదరాబాద్ నగరాన్ని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్వ్యవస్థీకరించినట్లు తెలిపారు. కోర్ – అర్బన్ రీజియన్‌ను సంపూర్ణంగా ప్రక్షాళన చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా వచ్చే ఐదేళ్లకు అవసరమైన స్పష్టమైన కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని నగర జోనల్ కమిషనర్లను ఆదేశించారు. నగరాన్ని జోన్లుగా పునర్వ్యవస్థీకరించిన నేపథ్యంలో కొత్తగా నియమితులైన జోనల్ కమిషనర్లతో ముఖ్యమంత్రి ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ – 2047 విజన్ డాక్యుమెంట్‌ను ప్రస్తావిస్తూ, రాష్ట్రాన్ని మొత్తం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలన్న ఆలోచనలో భాగంగానే హైదరాబాద్ నగర పరిపాలనను పట్టాలెక్కిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా నగరంలో చెత్త నిర్వహణ అత్యంత సంక్లిష్టమైన సమస్యగా మారిందని, ఈ అంశంపై జోనల్ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. చెత్త నిర్వహణతో పాటు ప్రజల సమస్యల పరిష్కార బాధ్యత పూర్తిగా జోనల్ కమిషనర్లదేనని సీఎం స్పష్టం చేశారు. ప్రతి రోజు క్షేత్రస్థాయిలో పరిశీలన తప్పనిసరిగా చేయాలని, నగరంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని దశలవారీగా అమలు చేయాలని ఆదేశించారు. చెరువులు, నాలాలు, చెత్త డంపింగ్ ప్రాంతాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ పెంచాలని, ఆక్రమణల నుంచి నగరాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైన ఉందని గుర్తు చేశారు. నెలకు మూడు రోజులు శానిటేషన్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించకూడదని స్పష్టం చేశారు. అలాగే రోడ్లపై గుంతలు లేకుండా నిరంతరం చర్యలు తీసుకోవాలని, ప్రతి పది రోజులకోసారి గార్బేజ్ క్లియరెన్స్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, దోమల నివారణతో పాటు అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాలుష్య నియంత్రణ దిశగా కోర్ – అర్బన్ ఏరియాలో డీజిల్ బస్సులు, ఆటోల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సీఎం వెల్లడించారు. జనన%–%మరణ ధ్రువీకరణలు, ట్రేడ్ లైసెన్సులు, ఇతర పత్రాల జారీ విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. ఆన్‌లైన్ సేవల ద్వారా పారదర్శక పాలన అందించాలని, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్లు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లతో నిరంతర కమ్యూనికేషన్ వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నెన్స్ వైపు అడుగులు వేయాలని దిశానిర్దేశం చేశారు. హైడ్రా, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ విభాగాలు జనవరి నుంచి నాలాల పూడిక తీత పనులు ప్రారంభించాలని, నగరంలో వీధి దీపాలు సరిపడా ఉండేలా చూడాలని సీఎం ఆదేశించారు. కోర్ – అర్బన్ ఏరియాలో వివిధ శాఖల అధికారుల మధ్య సమన్వయ బాధ్యతను స్పెషల్ సీఎస్ పర్యవేక్షిస్తారని తెలిపారు. "అందరూ కలిసి పనిచేస్తేనే హైదరాబాద్ నగర భవిష్యత్తు బాగుంటుంది" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో సీఎం సలహాదారు వేమ్ నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 'వేద న్యూస్' ఎఫెక్ట్

**– విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద గడ్డి తొలగింపు**

**వేద న్యూస్, జమ్మికుంట:**



'వేద న్యూస్' తెలుగు దినపత్రిక ప్రచురించిన కథనానికి స్పందన వచ్చింది. మండల పరిధిలోని పాపక్కపల్లి గ్రామం నుంచి రాచపల్లి వెళ్లే మార్గంలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేయగా, ఈ సంగతిని 'వేద న్యూస్' 'విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల వద్ద పొంచిన ప్రమాదం' శీర్షికన ఈ నెల 28న కథనం ప్రచురించింది. దీంతో గ్రామ పంచాయతీ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ విపరీతమైన పెరిగిన గడ్డిని తొలగించారు. దీంతో స్థానికులు, రైతులు 'వేద న్యూస్'కు కృతజ్ఞతలు తెలిపారు.



వేద న్యూస్
2025-12-28
https://epaper.vedhanews.in/

**విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పొంచిన ప్రమాదం**

- ట్రాన్స్‌ఫార్మర్లు అసలు కనిపిస్తలే
- చుట్టూ విపరీతంగా పెరిగిన గడ్డి

వేద న్యూస్, జమ్మికుంట:

మండల పరిధిలోని పాపక్కపల్లి గ్రామం నుంచి రాచపల్లి వెళ్లే మార్గంలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ విపరీతమైన గడ్డి పెరగడంతో ముప్పు పొంచి ఉందని రైతులు కొందరు చెబుతున్నారు. అసలు ట్రాన్స్‌ఫార్మర్లు కనిపించనంతగా గడ్డి పెరిగే అవకాశం ఉందని, వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ గడ్డి తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గడ్డి మొత్తం కప్పి వేసి ఉండటంతో ఏవైనా ఓల్టేజీ సమస్యలు వచ్చే అవకాశాలుంటాయని, అక్కడ చెట్లు పొదల వల్ల మరుగు ఏర్పడి సర్పాలు రావచ్చని గ్రామస్తులు చెబుతున్నారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఉన్న గడ్డిని తొలగించాలని కోరుతున్నారు.

వేద న్యూస్

బుధవారం డిసెంబర్ 31, 2025

# డబుల్ బెడ్రూమ్ ఇళ్లు శిథిలావస్థకు చేరడం బాధాకరం

**– సిరిసిల్ల పట్టణ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్**



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

ప్రజల కోసం నిర్మించిన ఇళ్లు ఇలా నిర్లక్ష్యానికి గురవడం ప్రజాధనానికి ఘోరమైన అవమానమని సిరిసిల్ల పట్టణ బీజేపీ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్ ప్రాంతంలో కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను స్వయంగా పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. శిథిలావస్థకు చేరి పిచ్చిమొక్కలతో నిండిపోయి ఉండటం అత్యంత దురదృష్టకరమన్నారు. ఖాళీగా ఉన్న ఇళ్లలోని ఎలక్ట్రికల్ వైర్లు, మోటార్లు, ఐరన్ సామాగ్రి దొంగలపాలవుతుండటంతో పాటు, ఈ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సిరిసిల్ల పట్టణ శివారులోని అత్యంత ఖరీదైన స్థలంలో గతంలో ఎస్సీ కులస్థుల కోసం కాలనీ నిర్మించగా, అది శిథిలావస్థకు చేరడంతో దాని స్థానంలో ఈ డబుల్ బెడ్రూమ్ ఇళ్లు నిర్మించారని తెలిపారు. అయితే ఇప్పుడు ఇవి కూడా అదే పరిస్థితికి చేరుతున్నాయని విమర్శించారు. ఈ ఇళ్లను తొలుత ఎస్సీ కులస్థులకు కేటాయించి, అనంతరం మిగతా అర్హులకు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఇప్పటివరకు ఆ ప్రక్రియ పూర్తికాకపోవడమే ఈ సమస్యకు కారణమని పేర్కొన్నారు. గతంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీ సమయంలో సుమారు 900 మంది లబ్ధిదారులు మిగిలి ఉన్నారని, కొంతమందికి మాత్రమే పట్టాలు ఇచ్చి, వారికి కనీసం స్థలం కూడా చూపించలేదని తీవ్ర విమర్శలు చేశారు. కిరాయిలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ఈ డబుల్ బెడ్రూమ్ ఇళ్లను వెంటనే కేటాయించాలని, లేకపోతే ఇవి పూర్తిగా కూలిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు తక్షణమే చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని బీజేపీ సిరిసిల్ల పట్టణ శాఖ తరపున డిమాండ్ చేస్తున్నట్లు దుమాల శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి కొండ నరేష్‌తో పాటు మెరుగు శ్రీనివాస్, మోర రవి, నరసయ్య, దూడం సురేష్, గాని శ్రీనివాస్, కంబోజి శ్రీధర్, అంకారపు రాజు, వర్ణాల శేఖర్ బాబు, అభి, కనుకయ్య, దేవరాజు తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ

- **నేటి రాత్రి 8 గంటల నుంచి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు**
- **16 స్పెషల్ టీంల నిరంతర పర్యవేక్షణ**
- **మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు**



**వేద న్యూస్, మెదక్:**

డిసెంబర్ 31 రాత్రి నూతన సంవత్సర వేడుకలను ప్రజలు శాంతియుతంగా, నిబంధనలకు లోబడి జరుపుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు కోరారు. ఇతరులకు ఇబ్బందులు కలగకుండా బాధ్య తాయుతంగా వేడుకలు నిర్వహించాలని ఆయన సూచించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లావ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతున్నట్లు తెలిపారు. చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడిన వారిని సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే నాన్‌బేలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరంగా చేపట్టనున్నట్లు తెలిపారు. రేపు సాయంత్రం 8 గంటల నుంచి ఈ తనిఖీలు ప్రారంభమవుతాయని, ఇందుకోసం 16 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్, స్పీడ్ రేసింగ్, ట్రిపుల్ రైడింగ్ వంటి చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకల సంద ర్భంగా డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని, అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు, ఈవెంట్లు నిర్వ హించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. రోడ్లపై కేక్ కటింగ్‌లు, టపా కాయలు, బైక్ రేసింగ్‌లు చట్ట విరుద్ధమని పేర్కొన్నారు.

# దుర్గం చెరువు ఆక్రమణలపై ఉక్కుపాదం

- **కబ్జాదారుల నుంచి ఐదు ఎకరాలు కాపాడిన హైడ్రా**
- **శాటిలైట్ చిత్రాల్లో బయటపడిన ఆక్రమణల చరిత్ర**
- **చెరువు రక్షణకు యుద్ధప్రాతిపదికన చర్యలు**




**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

చుట్టూ ఎత్తైన కొండల మధ్య సీక్రెట్ లేక్‌గా పేరొందిన దుర్గం చెరువును ఆక్రమణల చెర నుంచి విడిపించే దిశగా హైడ్రా కీలక చర్యలు చేపట్టింది. మాధాపూర్ ఇనార్బిట్ మాల్ వైపు దుర్గం చెరువు పరిధిలో అక్రమంగా ఆక్రమించిన సుమారు ఐదు ఎకరాల భూమిని హైడ్రా అధికారులు మంగళవారం తొలగించారు. మట్టితో నింపి వాహనాల పార్కింగ్‌గా ఉపయోగిస్తూ ప్రతి నెలా భారీగా అద్దెలు వసూలు చేస్తున్న దందాకు హైడ్రా చెక్ పెట్టింది. అక్కడున్న వాహనాలను ఖాళీ చేయించి తాత్కాలికంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, మట్టి తొలగింపుకు చర్యలు చేపట్టింది. దుర్గం చెరువులో జరుగుతున్న బహిరంగ ఆక్రమణలపై ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. సంబంధిత శాఖల అధికారులతో క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని ఆదేశించారు. విచారణలో ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారణ కావడంతో, కమిషనర్ ఆదేశాల మేరకు ఐదు ఎకరాల మేర అక్రమ నిర్మాణాలు, మట్టి నింపుదలను తొలగించారు. ఈ చర్యలతో చెరువు పరిరక్షణపై ప్రభుత్వం గట్టి సంకల్పంతో ముందుకు సాగుతోందన్న సంకేతాలు స్పష్టమయ్యాయి.

**కళ్లకు కట్టినట్టు ఆక్రమణలు**

గోల్కొండ కోటలోని రాజవంశానికి ఒకప్పుడు తాగునీరు అందించిన దుర్గం చెరువు నేడు ఆక్రమణల దుర్గంధంతో కుంచించుకుపోయింది. ఒకప్పుడు నూట అరవై ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు ప్రస్తుతం నూట పదహారు ఎకరాలకు పరిమితమైంది. ఉత్తర దిశ తప్ప మిగిలిన మూడు వైపులా ఆక్రమణల బారిన పడింది. పంతొమ్మిది వందల డెబ్బై ఆరు నాటికే ఇరవై తొమ్మిది ఎకరాల మేర కబ్జా జరగగా, ఆ తర్వాత క్రమంగా చెరువు విస్తీర్ణం తగ్గుతూ వచ్చింది. ఏ ఏ సంవత్సరాల్లో ఎంత మేర ఆక్రమణలు జరిగాయో జాతీయ దూరదర్శి కేంద్రం అందించిన శాటిలైట్ చిత్రాలు కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాయి. మాధాపూర్ వైపు కొండలను తవ్వుతూ భవనాలు నిర్మించిన వారు దుర్గం చెరువును మట్టి డంపింగ్ యార్డుగా మార్చారని అధికారులు గుర్తించారు. పది నుంచి పదిహేను మీటర్ల మేర మట్టి నింపి క్రమంగా చెరువులోకి చొచ్చుకువచ్చి ఐదు ఎకరాల భూమిని ఆక్రమించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఈ భూమి తమదని ఒక ప్రజాప్రతినిధి క్లెయిమ్ చేస్తుండగా, ఎలాంటి రెవెన్యూ రికార్డులు లేకుండానే పార్కింగ్ దందా సాగిస్తున్నట్లు తేలింది. ఈ ఆక్రమణల వల్ల చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం కూడా అడ్డంకులకు గురైంది. హెచ్‌ఎండీఏ రెండు వేల పద్నాలుగులో దుర్గం చెరువు విస్తీర్ణాన్ని నూట అరవై దశాంశ ఏడు ఎకరాలుగా నిర్ధారిస్తూ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. సర్వే ఆఫ్ ఇండియా, రెవెన్యూ రికార్డులు, శాటిలైట్ చిత్రాల ఆధారంగా చెరువు అసలు విస్తీర్ణాన్ని ఖరారు చేసే పనిలో హైడ్రా నిమగ్నమైంది. ఈలోపు చెరువు పరిధిలో ఉన్న ఆక్రమణలను ఒక్కొక్కటిగా తొలగిస్తూ దుర్గం చెరువును మళ్లీ ప్రజల కోసం జీవంత సరస్సుగా మార్చే దిశగా చర్యలు కొనసాగిస్తోంది.

# ప్రభుత్వ భూమిని కాపాడాలని కేక్ కట్ చేసి నిరసన

**వేద న్యూస్, శంకరపట్నం:**




ప్రభుత్వ భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించి యథేచ్ఛగా దున్నుకుంటున్నారని తెలంగాణ జన సమితి (టీజేఎస్) మండల అధ్యక్షుడు మొరె గణేష్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని మొలంగూర్ గ్రామ శివారులోని సర్వే నెంబరు 703లో ఆక్రమణకు గురైన ఈ ప్రభుత్వ భూమిని పేదలైన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై వినూత్నంగా కేక్ కట్ చేసి నిరసన వ్యక్తం చేశారు. గతంలో ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, వాటిని పక్కనపెట్టి అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు మొద్దు నిద్ర వీడి ప్రభుత్వ భూమిని కాపాడి ఇల్లు లేని నిరుపేదలకు కేటాయించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దండు రాజేష్‌తో పాటు గ్రామ ప్రజలు శ్రీనివాస్, నరేష్, శివప్రసాద్, అజయ్, శివ సాయి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**




రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ గన్నేరం వసంత నర్సయ్య ఆధ్వర్యంలో ఆర్ఎక్స్ పర్ట్ సూపర్ స్పెషాలిటీ ఈ క్లినిక్ సిబ్బంది ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం సర్పంచ్ వసంత నర్సయ్య మాట్లాడుతూ, గ్రామ ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో బీపీ, షుగర్‌తో పాటు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎలవేని రమేష్, రీజినల్ హెడ్ చెని వెంకటేష్, బ్రాంచ్ మేనేజర్ కీర్తన, వార్డు సభ్యులు లింగంపల్లి అనిల్, దర్శనం మరియ నాయకులు మిసరగండ్ల అనిల్, బొప్ప శ్రీనివాస్, యూత్ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# న్యూ ఇయర్ పేరుతో సైబర్ మోసాలు

- **అపరిచిత లింక్‌లు ఓపెన్ చేయొద్దు**
- **ఉచిత బహుమతులంటూ మోసాలు**
- **అనుమానం వస్తే వెంటనే సంప్రదించాలి**
- **తెలంగాణ పోలీసుల హెచ్చరిక**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో సైబర్ మోసాలు పెరుగుతున్నాయని తెలంగాణ పోలీస్ హెచ్చరించింది. న్యూ ఇయర్ పేరుతో ఉచిత బహుమతులు, గిఫ్ట్ కార్డులు, క్యాష్ రివార్డులు అంటూ అపరిచిత లింక్‌లు పంపించి ప్రజలను మోసం చేస్తున్నారని పోలీసులు తెలిపారు. ఇలాంటి లింక్‌లను క్లిక్ చేయకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రీటింగ్స్ కోసం అపరిచిత లింక్‌లపై క్లిక్ చేయవద్దని, వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే లింక్‌లతో భద్రతా సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. క్యూఆర్ కోడ్‌లు లేదా అనుమానాస్పద లింక్‌ల ద్వారా బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారం దోచుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. ఉచిత బహుమతుల పేరిట వచ్చే సందేశాలు ఎక్కువగా సైబర్ మోసాలేనని స్పష్టం చేశారు. అనుమానాస్పద లింక్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ షేర్ చేయకూడదని, తెలియని వెబ్‌సైట్లలో వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దని సూచించారు. కొత్త సంవత్సర వేడుకల సమయంలో ఆనందం పేరుతో మోసాలకు గురి కాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ పోలీస్ కోరింది. సైబర్ మోసాలకు గురైనట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని, లేదా సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా వ్యవహరిస్తేనే సైబర్ నేరాలను అరికట్టడం సాధ్యమని తెలంగాణ పోలీస్ స్పష్టం చేసింది.

# ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**వేద న్యూస్, దామరచర్ల:**




దామరచర్ల మండల కేంద్రంలో మంగళవారం ఎస్ఎఫ్ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వీరన్న నాయక్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1970లో కేరళలో "అధ్యయనం–పోరాటం" నినాదంతో కొద్దిమంది విద్యార్థులతో ప్రారంభమైన ఎస్ఎఫ్ఐ నేడు దేశవ్యాప్తంగా 30 లక్షల మంది సభ్యులతో అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎదిగిందన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన, శాస్త్రీయమైన ఉచిత విద్య అందించాలనే లక్ష్యంతో ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతోందని తెలిపారు. దేశాన్ని పరిపాలిస్తున్న భారతీయ జనతా పార్టీ తీసుకొచ్చిన నూతన విద్యా విధానం ద్వారా చరిత్రను వక్రీకరించి మతోన్మాద విద్యను విద్యార్థులపై రుద్దే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. అలాగే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ విద్యాశాఖకు మంత్రి లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించి, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంతో పాటు సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు అజయ్, నాగరాజు, గణేష్, పవన్, సాగర్, ప్రసాద్, రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తి

- **పరిరక్షణలో ఎలాంటి రాజీ లేదు**
- **మైనార్టీల శ్మశానవాటికల సమస్యకు త్వరిత పరిష్కారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**



ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తులని, వాటి పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు, ఇతర కీలక అంశాలపై సచివాలయంలో అధికారులతో నిర్వహించి న సమీక్ష సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో సహచర మంత్రి మహ్మద్ అజారుద్దీన్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కూడా పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని బోరబండ, ఎర్రగడ్డ, షేక్‌పేట్ ప్రాంతాల్లో దశాబ్దాలుగా మైనార్టీలు శ్మశాన వాటికలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. ఈ సమస్యను వీలైనంత త్వరితగతిన రక్షణ శాఖ, రెవెన్యూ శాఖ, వక్ఫ్ బోర్డు సమన్వయంతో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అవసరమైన చోట రెవెన్యూ భూమిని రక్షణ శాఖకు బదలాయించి, వారి నుంచి ప్రత్యామ్నాయ భూమిని తీసుకోవాలని, అలాగే అనుకూలమైన భూమిని వక్ఫ్ బోర్డుకు అప్పగించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో కఠినంగా వ్యవహరించాలని మంత్రి స్పష్టం చేశారు. పేదల సంక్షేమం, ప్రజా అవసరాలు, అభివృద్ధి కార్యక్రమాల కోసం వినియోగించాల్సిన ప్రభుత్వ భూములను కొద్దిమంది స్వార్థ ప్రయోజనాల కోసం ఆక్రమించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని తేల్చి చెప్పారు. ఆక్రమణలను గుర్తించిన వెంటనే నోటీసులు జారీ చేయాలని, అవసరమైతే భూములను ఖాళీ చేయించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. వివాదాల్లో ఉన్న భూముల పరిరక్షణకు న్యాయపరంగా ఎదుర్కొని కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో టీఎంఆర్ఈఐఎస్ వైస్ చైర్మన్ ఫహీం ఖురేషి, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి బి. షఫీల్లాహ్, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

బుధవారం డిసెంబర్ 31, 2025

# పద్మశాలీలు అన్నిరంగాల్లో రాణించాలి

**- టీఆర్పీఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్**

**వేద న్యూస్, శాయంపేట :**



పద్మశాలీలు అన్నిరంగాల్లో రాణించాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మండల అధ్యక్షు సామల మధుసూదన్ అన్నారు. మంగళవారం మండలంలో నూతనంగా గెలిచిన పద్మశాలి సర్పంచులు, వార్డు సభ్యులకు సంఘం ఆధ్వర్యంలో శాలువలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. పద్మశాలీలు ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వావిలాల వేణుగోపాల ప్రసాద్, కందగట్ల ప్రకాష్, కోశాధికారి రంగు శ్రీధర్, నాయకులు జలంధర్, మాచర్ల రవి, వావిలాల రాజేందర్, బాసని లక్ష్మీనారాయణ, సదాశివుడు, గుండా రమేష్, దాసరి కుమారస్వామి, వెంకటేశ్వర్లు, బడుగు రవీందర్, అశోక్, భాను తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత అధ్యక్షతన అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నిజామాబాద్ జిల్లా ఇంఛార్జ్ మంత్రి దనసరి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డికి, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్ కి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి నూతన పాలకవర్గం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇందూరు సునీత మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక... నాలుగు గోడల మధ్యలో చేసిన తప్పుడు సర్వేలు కాకుండా ప్రస్తుత పాలకవర్గం, గ్రామ పెద్దల సమక్షంలో జరగాలన్నారు. అధికారులతో సమగ్ర సర్వే నిర్వహించి, ఆ సర్వేను గ్రామసభలో ప్రవేశపెట్టి, అసలైన లబ్ధిదారులను ఎంపిక చేయాలాని కోరారు. నిరుపేదలైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పంపిణీ చేయాలనీ తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ ప్రేమ్ దాస్, ఉప సర్పంచ్ నిస్సర్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# మెనూ ఖచ్చితంగా పాటించాలి

**- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- ట్రైబల్ వెల్ఫేర్ గురుకులంలో ఆకస్మిక తనిఖీ**

**వేద న్యూస్, వేములవాడ:**



విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయం మానాలలో మంగళ వారం ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించడంతో పాటు స్టోర్ రూమ్‌లోని ఆహార సామగ్రి, కోడి గుడ్లు, కూరగాయలు, విద్యార్థుల కోసం సిద్ధం చేసిన భోజన పదార్థాలను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం చికెన్, మటన్, కోడి గుడ్లు అందిస్తున్నారా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని, ఆర్థికంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. విద్యాలయ ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని, ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు

# మండల అధికారులను కలిసిన నూతన ప్రజాప్రతినిధులు

**వేద న్యూస్, శాయంపేట:**




బీఆర్ఎస్ పార్టీ శాయంపేట మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నూతనం గా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు శాయంపేట మండల ఎంపీడీవో, ఎమ్మా ర్వో, ఎస్ఐలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరి ష్కారంలో అధికారుల సహకారం అవసరమని నాయకులు తెలిపారు. మండల పరిధిలో సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నూతన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులతో పాటు మండల ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలో ఫొటో గ్రాఫర్స్ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని ఫొటోగ్రాఫర్స్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రుద్రూర్ మండల అసోసియేషన్ ఫొటోగ్రాఫర్ అధ్యక్షుడు ఎస్కే హుస్సేన్, ఉపాధ్యక్షుడు సమీప్, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, కోశాధికారి సాయిలు, సలహాదారులుగా మోహన్, శివ స్వామిలను ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్ అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఫొటో గ్రాఫర్ల కుటుంబ బతుకుతెరవు కోసం ఎంతో కష్టపడుతున్నారని అన్నారు. అన్ని ధరలు పెరగడంతో చాలీచాలని జీవితాలలో చాలా కష్టాలు ఉండటం వలన ప్రోగ్రాం ధరలను పెంచడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫొటో గ్రాఫర్లు శేఖర్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

# పిల్లలతో పని చేయించడం నేరం

**- బాలల సంరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి**
**- బాల కార్మిక వ్యవస్థపై జీరో టాలరెన్స్ విధానం**
**- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు చందన**
**- జనవరి 1 నుంచి 31 వరకు ఆపరేషన్ స్మైల్**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



జిల్లాలో జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా అన్నిశాఖలు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు మర్రిపెల్లి చందన అన్నారు. జిల్లా ఎస్పీతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆమె ఈ విషయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్న పిల్లలతో వెట్టిచాకిరి చేయించడం, పనుల్లో పెట్టుకోవడం నేరమని, అలా చేసిన యజమానులపై క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. బాల కార్మిక వ్యవస్థపై ప్రభుత్వం జీరో టాలరెన్స్ విధానాన్ని కఠినంగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ప్రజల సహకారంతోనే బాలల రక్షణ సాధ్యమవుతుందన్నారు. రక్షించబడిన పిల్లలు మళ్లీ బాల కార్మికులుగా మారకుండా పునరావాస కార్యక్రమాలు చేపట్టే బాధ్యత సంబంధిత శాఖల అధికారులదేనని, బాల కార్మిక రహిత సమాజమే లక్ష్యంగా పనిచేయాలని ఆమె తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు మాట్లాడుతూ, బాలల హక్కుల పరిరక్షణకు జిల్లా పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందన్నారు. బాల కార్మికులపై ఫిర్యాదులు అందిన వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమానికి అదనపు ఎస్పీ చంద్రయ్య ఆధ్వర్యంలో సిరిసిల్ల, వేములవాడ డివిజన్లలో ఎస్ఐ స్థాయి అధికారులతో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ బృందాలు పరిశ్రమలు, హోటళ్లు, వ్యాపార సముదాయాలు, గోదాములు, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీలు తదితర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తాయని తెలిపారు. స్కూల్‌కు వెళ్లకుండా డ్రాప్‌అవుట్ అయిన పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి, పిల్లలను తిరిగి పాఠశాలలకు పంపేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలతో పని చేయిస్తున్న వారిపై 2025లో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ కార్యక్రమాల్లో 22 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, 129 మంది పిల్లలను సంరక్షించినట్లు ఎస్పీ గుర్తు చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీడబ్ల్యూఓ లక్ష్మీరాజాం, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ అంజయ్య, ఎస్ఐలు, వివిధ శాఖల అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వృద్ధులకు దుప్పట్లు, నిత్యవసర సరుకుల పంపిణీ

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**






వాగ్దేవి కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఆఫ్ డేటా సైన్స్ విభాగంలోకి కేరింగ్ హ్యాండ్స్ క్లబ్, ఓరుగల్లు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్వయం కృషి వృద్ధాశ్రమంలో దుప్పట్లు, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నగరంలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న నేపథ్యంలో చలి తీవ్రత పెరిగిందన్నారు. వృద్ధులు ఇబ్బందులు పడకుండా తమ వంతు బాధ్యతగా దుప్పట్లు పంపిణీ చేయడం జరిగినదన్నారు. మునుముందు ఇలాంటి స్వచ్ఛంద కార్యక్రమాలు మరెన్నో చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ప్రకాష్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ తిరుపతిరావు, ఓరుగల్లు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ వీణావాణి, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినర్ డాక్టర్ బెనర్జీ, హెచ్ఓడి డాక్టర్ ఆయేషా బాను, కోఆర్డినేటర్స్ పి. మౌనిక, బండి రోహిత్, ఓరుగల్లు స్వచ్ఛంద సంస్థ సభ్యులు మచ్చిక రాజు, అష్రఫ్ అలీ, లింగబత్తిని కృష్ణ,విద్యార్థిని,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు జరగాలి

**- తప్పనిసరి ఆన్ లైన్లో నమోదు చేయాలి**
**- సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన అవసరం**
**- విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలి**
**- మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు**

**వేద న్యూస్, మెదక్ జిల్లా:**




ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు జరగాలని, స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు మంగళవారం శంకరంపేట్-ఆర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణ పరిశుభ్రత, సిబ్బంది బ్యారక్స్, కార్యాలయ నిర్వహణ, కేసుల రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. అలాగే కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గ్రామాల బాధ్యతలు నిర్వహిస్తున్న గ్రామ పోలీస్ అధికారులకు తమ పరిధిలోని గ్రామాలపై పూర్తి అవగాహన ఉండాలని, గ్రామ పెద్దలు, యువతతో సత్సంబంధాలు కొనసాగించాలని తెలిపారు. స్టేషన్ పరిధిలోని అనుమానితులు, రౌడీషీటర్లను తరచూ తనిఖీ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తింపు పరికరాల ద్వారా తనిఖీ చేయాలని, ఆస్తి సంబంధిత నేరాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను హాట్‌స్పాట్లుగా గుర్తించి నిఘా కట్టుదిట్టం చేయాలని సూచించారు. ప్రజల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్టేషన్ రికార్డులు ఎలాంటి పెండింగ్ లేకుండా నిర్వహించాలని, పెండింగ్ కేసులపై నిరంతరం సమీక్ష చేసి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సైబర్ నేరాల నివారణకు పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రతిరోజూ వాహనాల తనిఖీలు నిర్వహించాలని, అనుమానాస్పద వాహనాలను వెంటనే అదుపులోకి తీసుకోవాలని తెలిపారు. బ్లూ కోల్ట్స్ సిబ్బంది కేటాయించిన ప్రతి పాయింట్‌ను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, డయల్%-%100 కాల్స్‌కు వేగంగా స్పందించాలని ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ రాష్ట్ర పోలీస్ శాఖ ప్రవేశపెట్టిన డిజిటల్ వ్యవస్థలను సమర్థవంతంగా ఉపయోగించి నేరాల నియంత్రణలో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీల్లో జిల్లా ఎస్పీ వెంట తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, రామాయంపేట్ సీఐ వెంకట రాజా గౌడ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఎస్ఐ నారాయణతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సంక్రాంతి రద్దీపై ముందస్తు చర్యలు

**- రద్దీ రోజుల్లో లేన్ క్లోజర్లు నిలిపివేత**
**- సురక్షిత ప్రయాణమే ప్రభుత్వ లక్ష్యం**
**- హైదరాబాద్-విజయవాడ హైవేపై రద్దీ నివారణకు మంత్రి కోమటిరెడ్డి ఆదేశాలు**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**



సంక్రాంతి పండుగ సందర్భంగా నేషనల్ హైవేలపై ఏర్పడే ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై జనవరి ఎనిమిదో తేదీ నుంచి వాహన రద్దీ అధికంగా ఉండనున్న నేపథ్యంలో, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రద్దీ రోజుల్లో రహదారులపై లేన్‌లను మూసివేసే పనులను పూర్తిగా నిలిపివేయాలని మంత్రి స్పష్టం చేశారు. అన్ని లేన్‌లను వాహనాల రాకపోకలకు అందుబాటులో ఉంచాలని, అవసరమైన చోట్ల తాత్కాలిక మరమ్మతులు వాయిదా వేయాలని సూచించారు. టోల్ ప్లాజాలు, జంక్షన్లు, ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో అదనపు ట్రాఫిక్ పోలీసులను మోహరించాలని ఆదేశించారు. ప్రయాణికులకు స్పష్టమైన దిశానిర్దేశం అందించేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లో స్పష్టంగా కనిపించే హై విజిబిలిటీ బారికేడ్లు వినియోగించాలని మంత్రి సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా కంట్రోల్ రూమ్‌లు, సహాయక బృందాలు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు తెలిపారు. సంక్రాంతి పండుగకు లక్షలాది మంది సొంతూళ్లకు ప్రయాణిస్తారని, వారి భద్రత, సౌకర్యమే ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ప్రజలు సురక్షితంగా, సజావుగా తమ పండుగ ప్రయాణాలను పూర్తిచేసేలా ప్రభుత్వం పూర్తి బాధ్యతతో పనిచేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.

వేద న్యూస్
బుధవారం డిసెంబర్ 31, 2025

# ఎన్నారై బీఆర్ఎస్ యూకే విభాగం 15వ వార్షికోత్సవం

- కేసీఆర్, కేటీఆర్‌లకు శుభాకాంక్షలు తెలిపిన ఎన్నారై బీఆర్ఎస్ నేతలు
- కేక్ కట్ చేసి అభినందనలు తెలిపిన కేటీఆర్
- ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని కేసీఆర్ సూచన



**హైదరాబాద్ వేద న్యూస్ :**

ఎన్నారై బీఆర్ఎస్ యూకే విభాగం 15వ వార్షికోత్సవం సందర్భంగా ఆ విభాగం అధ్యక్షుడు నవీన్ రెడ్డి నేతృత్వంలోని బృందం హైదరాబాద్‌లో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మరియు కల్వకుంట్ల తారక రామారావులను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేక్ కట్ చేసి ఎన్నారై బీఆర్ఎస్ యూకే విభాగానికి శుభాకాంక్షలు తెలిపారు. విదేశాల్లో ఉంటూనే పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న తీరును ఆయన ప్రశంసించారు. తర్వాత ఎన్నారై బీఆర్ఎస్ యూకే నేతలు పార్టీ అధినేత కేసీఆర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి లండన్ వేదికగా ఎన్నారై బీఆర్ఎస్ యూకే విభాగం నిర్వహించిన పోరాటాన్ని ఎప్పటికీ మరవలేమని కేసీఆర్ పేర్కొన్నారు. అన్ని సందర్భాల్లో పార్టీ గొంతుకగా నిలుస్తూ ఖండాంతరాల్లో నిరంతరం పనిచేస్తున్న మీ కృషి ప్రశంసనీయమని తెలిపారు. అదే స్ఫూర్తితో ముందుకు సాగాలని, తెలంగాణ ప్రజలకు అండదండలుగా ఉంటూ ప్రభుత్వంపై పోరాటం కొనసాగించాలని దిశానిర్దేశం చేశారు. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేస్తూ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్, కేటీఆర్‌ల నాయకత్వంలో గులాబీ జెండా మోసే అవకాశం కల్పించినందుకు ఎప్పటికీ కృతజ్ఞులమని తెలిపారు. దూరంగా ఉన్నా పార్టీ కోసం పని చేసే అవకాశం తమకు గర్వకారణమన్నారు. 15 ఏళ్లుగా తమ బృందాన్ని ప్రోత్సహించిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ ప్రజలు, వివిధ ప్రవాస సంస్థలు, మీడియా సంస్థలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా అదే స్ఫూర్తితో పనిచేస్తూ కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసే వరకు అవిశ్రాంతంగా శ్రమిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి, గ్లోబల్ కో-ఆర్డినేటర్ మహేష్ బిగాల, అడ్వైసరీ బోర్డు చైర్మన్ సిక్కా చంద్రశేఖర్ గౌడ్, ఉపాధ్యక్షుడు సతీష్ రెడ్డి గొట్టెముక్కల, కార్యదర్శి రవి ప్రదీప్ పులుసు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందకుంట మండల
# సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా సురేష్



\- ఏకగ్రీవ ఎన్నిక..

**వేద న్యూస్, ఇల్లందకుంట:**

ఇల్లందకుంట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు పార్టీలకు అతీతంగా ఇల్లందకుంట మండలకేంద్ర సర్పంచ్ దరా సురేష్‌ను ఇల్లంద కుంట మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుని గా మర్రివానిపల్లి సర్పం చ్ మర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఉపా ధ్యక్షులుగా భూష అశోక్ యాదవ్, రేణిగుంట్ల శ్యామల కుమార్, ప్రధాన కార్యదర్శిగా తోడేటి శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారిగా చింతం శ్రీలత రాంబాబు, కార్యవర్గ సభ్యులుగా బైరెడ్డి రమణారెడ్డి, రామంచ సంపత్, సప్పి మాధవి రాజేష్ ,చర్లపల్లి శ్రీనివాసులను ఎన్నుకున్నారు ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. ఇల్లందకుంట మండల పరిధిలోని 18 గ్రామాల సర్పంచులకు ఏ సమస్య వచ్చిన ముందుంటానని, సర్పంచులందరినీ కలుపుకొని ముందుకెళ్తానని చెప్పారు. ఈ ఎన్నికకు సహకరించిన మండల సర్పంచులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికైన సభ్యులను శాలువాలతో పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంకణాల శ్రీలత సురేందర్ రెడ్డి, కోమల్ రెడ్డి, మర్రి వనపర్తి తదితరులు పాల్గొన్నారు.

# న్యూ ఇయర్ వేడుకల ముందు కట్టుదిట్టమైన నైట్ చెకింగ్

- ఆపరేషన్ చెబుత్ర కింద భారీ తనిఖీలు
- మద్యం తాగి డ్రైవింగ్‌పై ఉక్కుపాదం
- శాంతియుత వేడుకలకే పోలీసుల ప్రాధాన్యం




**హైదరాబాద్ వేద న్యూస్ :**

న్యూ ఇయర్ వేడుకలు శాంతియుతంగా జరిగేలా జిల్లావ్యాప్తంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు 'ఆపరేషన్ చెబుత్ర'లో భాగంగా డిసెంబర్ 31 అర్ధరాత్రి వరకు విస్తృత స్థాయిలో నైట్ చెకింగ్‌లు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలుగా ఈ తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. జిల్లాలోని రద్దీ కూడళ్లతో పాటు సున్నిత ప్రాంతాల్లో అనేక చెక్‌పాయింట్లు ఏర్పాటు చేసి వాహనాలు, ప్రజల కదలికలను నిశితంగా పరిశీలించారు. మత్తుపదార్థాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ బృందాలను రంగంలోకి దించారు. గతంలో నేరాలకు పాల్పడిన వారిపై, మత్తు కేసుల నిందితులపై ప్రత్యేక నిఘా కొనసాగించినట్లు వెల్లడించారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో సరైన పత్రాలు లేకుండా తిరుగుతున్న సుమారు 150 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 30 మందిపై కేసులు నమోదు చేశారు. రహదారులపై అల్లర్లు, అనుమతి లేని పార్టీల నిర్వహణ, బహిరంగ మద్యం సేవనాన్ని పూర్తిగా అడ్డుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా డీజే కార్యక్రమాలు, రోడ్డుపై గందరగోళం సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై వాహనాల స్వాధీనం, పది వేల రూపాయల వరకు జరిమానా, ఆరు నెలల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు ఇళ్లలోనే శాంతియుతంగా న్యూ ఇయర్‌ను జరుపుకోవాలని, ఏదైనా అనుమానాస్పద ఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

# రోడ్డుపై కేక్ కట్ చేస్తే కఠిన చర్యలు

\- ఇల్లందకుంట మండల ఎస్సై క్రాంతి కుమార్



**వేద న్యూస్, ఇల్లందకుంట:**

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల రక్షణ దృష్టిలో ఉంచుకొని ప్రశాంతమైన వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని ఇల్లందకుంట మండల ఎస్సై క్రాంతి కుమార్ సూచించారు. మద్యం సేవించి వాహనం నడిపితే జరిమానా తో పాటు లైసెన్స్ రద్దు చేయడంతో పాటు జైలు శిక్ష తప్పదని తెలిపారు. ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, అతివేగం నిషేధం అని, భారీ శబ్దాలతో ఇబ్బంది కలిగించే వాహనాలను సీజ్ చేస్తామని, మైనర్ పిల్లలకు వాహనాలు ఇచ్చే యజమానులు మరియు తల్లిదండ్రులపై కేసు నమోదు చేయబడునని వెల్లడించారు. హోటల్లు రెస్టారెంట్లు వారికి కేటాయించిన సమయాన్ని పాటించాలని నిషేధిత పదార్థాలపై వినియోగం జరిగితే హోటల్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. 31 డిసెంబర్ తో పాటు జనవరి 1 రోజున ముఖ్యమైన ప్రదేశాల్లో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామని, అత్యవసర సమయాల్లో ఏదైనా సాయం కోసం వెంటనే 100 కి డయల్ చేయాలని సూచించారు. రోడ్డుపై కేక్ కట్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# కనకదుర్గమ్మ ఆలయంలో తలనీలాల వేలం రికార్డు



- రూ.10.10 కోట్లకు టెండర్ దక్కించుకున్న సంస్థ
- గతంతో పోలిస్తే రెట్టింపు ఆదాయం
- నాలుగు రాష్ట్రాల నుంచి కాంట్రాక్టర్ల పోటీ

**అమరావతి,వేద న్యూస్ :**

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన లికనకదుర్గమ్మ ఆలయంలిలో తలనీలాల వేలం పాట చరిత్ర సృష్టించింది. భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించే తలనీలాలను సేకరించే హక్కుల కోసం నిర్వహించిన వేలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ ధర పలికింది. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్ సంస్థ రూ.10.10 కోట్లకు ఈ టెండర్‌ను దక్కించుకుంది. దీంతో ఈసారి ఆలయానికి గణనీయమైన ఆదాయం సమకూరింది. రెండేళ్ల క్రితం నిర్వహించిన వేలంలో తలనీలాల సేకరణ ద్వారా ఆలయానికి రూ.5.67 కోట్లు మాత్రమే రాగా, తాజా వేలంలో దాదాపు రెట్టింపు ఆదాయం రావడం విశేషంగా మారింది. తాజా ఒప్పందం ప్రకారం 2026 - 27 ఆర్థిక సంవత్సరానికి రూ.10.10 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. తదుపరి సంవత్సరం 2027%-%28కి ఈ మొత్తంపై మరో 10 శాతం అదనంగా, అంటే రూ.11.11 కోట్లకు టెండర్ ఖరారైంది. ఈ వేలం ప్రక్రియను దుర్గగుడిలోని మల్లికార్జున మహా మండపం ఆరో అంతస్తులో ఆలయ అధికారులు నిర్వహించారు. ఈ వేలంలో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి మొత్తం 19 మంది కాంట్రాక్టర్లు పోటీపడ్డారు. బహిరంగ వేలం, సీల్డ్ టెండర్, ఈ-టెండర్ విధానాల్లో బిడ్లను ఆహ్వానించగా, నలుగురు కాంట్రాక్టర్లు సీల్డ్ టెండర్లు దాఖలు చేశారు. చివరికి బహిరంగ వేలంలో అత్యధిక ధరను కోట్ చేసిన ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్ సంస్థ హక్కులను సొంతం చేసుకుంది. ఈ వేలం ద్వారా కనకదుర్గమ్మ ఆలయ ఆదాయం గణనీయంగా పెరగడంపై దేవస్థాన అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భక్తుల సమర్పణల ద్వారా వచ్చే ఆదాయం ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.


# కరీంనగర్ శివారులో పెద్దపులి సంచారం



**కరీంనగర్ వేద న్యూస్ :**

కరీంనగర్ రూరల్ మండలం చర్లబూత్కూర్, కొండాపూర్ ఐత్రాచుపల్లి చమనపల్లి, బహద్దూర్ ఖాన్‌పేట గ్రామాల్లో పులి సందర్శించినట్లు అధికారులు గుర్తించారు. ఈ గ్రామాల పరిధిలోని మామిడి తోటలు, పంట పొలాల్లో పులి పాదాలను గుర్తించిన స్థానికులు ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వెళ్లి పరిశీలించారు. అవి పులి పాదాల గుర్తులేనని ధృవీకరించి స్థానిక ప్రజలను అప్రమత్తం చేశారు. ఒంటరిగా బయటక వెళ్లకూడదన్నారు. ఈ గ్రామాలతో ఈ ప్రాంతంలోని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

# ఏపీ గ్రూప్ - 2 అభ్యర్థులకు హైకోర్టు భారీ ఊరట



**అమరావతి,వేద న్యూస్ :**

ఆంధ్రప్రదేశ్ గ్రూప్ -2 అభ్యర్థులకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. గ్రూప్ -2 నియామకాల్లో రిజర్వేషన్ రోస్టర్ పాయింట్లను సవాలు చేస్తూ దాఖలైన అన్ని పిటిషన్లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. దీంతో గత కొంతకాలంగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. ఈ తీర్పుతో లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులకు ఉపశమనం కలిగింది. 2023లో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ జారీ చేసిన గ్రూప్%-%2 నోటిఫికేషన్‌పై పలువురు అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికులు, క్రీడాకారులకు కేటాయించిన ప్రత్యేక రిజర్వేషన్ పాయింట్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని వారు వాదించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రోస్టర్‌ను సరిచేసి, పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసి కొత్తది జారీ చేయాలని పిటిషనర్లు కోరారు. ఈ అంశంపై సమగ్ర విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం పిటిషనర్ల వాదనలను తోసిపుచ్చింది. అన్ని పిటిషన్లు కొట్టివేయడంతో గ్రూప్ -2 నియామక ప్రక్రియకు ఎలాంటి న్యాయపరమైన అడ్డంకులు లేవని స్పష్టం చేసింది. ఇప్పటికే ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు పూర్తయిన నేపథ్యంలో ఈ తీర్పు అభ్యర్థుల్లో కొత్త ఆశలు రేకెత్తించింది.రోస్టర్ పాయింట్ల వివాదంతో నియామకాలు ఎక్కడ ఆగిపోతాయోనని ఆందోళన చెందిన అభ్యర్థులకు ఈ తీర్పు పెద్ద ఊరటనిచ్చింది. న్యాయపరమైన చిక్కులు తొలగిపోవడంతో ఏపీపీఎస్సీ తదుపరి నియామక ప్రక్రియను వేగవంతం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. త్వరలోనే తుది ఫలితాలు, నియామకాల ప్రక్రియ ముందుకు సాగే అవకాశం ఉందని అభ్యర్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# న్యూ ఇయర్ ఈవ్
# సంబరాల వెనుక దాగిన ఆత్మపరిశీలన

**వేద న్యూస్ డెస్క్:**

సంవత్సరం చివరి అంచుకు వచ్చేసిన ఈ రోజు కేవలం క్యాలెండర్‌లో మరో తేదీ కాదు. న్యూ ఇయర్ ఈవ్ అనేది మన జీవితాలపై ఒక విరామం తీసుకుని వెనక్కి తిరిగి చూసే అరుదైన అవకాశం. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, కొత్త ఆశలు కొత్త లక్ష్యాలతో ముందుకు అడుగు వేయాల్సిన క్షణం ఇది. గడియారం ముళ్లు అర్ధరాత్రి వైపు కదులుతున్న కొద్దీ, మనసులు మాత్రం గత పన్నెండు నెలల జ్ఞాపకాలతో నిండిపోతాయి. విజయాల ఆనందం, విఫలాల వేదన, నెరవేరని కలల బాధ, ఊహించని పాఠాలు ఇవన్నీ ఈ ఒక్క రోజులోనే మన ముందుకు వస్తాయి.

ప్రపంచవ్యాప్తంగా న్యూ ఇయర్ ఈవ్ వేడుకలతో మెరుస్తుంది. నగరాల్లో ఆకాశాన్ని చీల్చే బాణసంచా, వీధుల్లో ఉత్సవ వాతావరణం, ఇళ్లలో కుటుంబాలతో కలిసి చేసే ప్రార్థనలు %-% ఇవన్నీ ఒక వైపు. కానీ మరో వైపు, మౌనంగా కూర్చొని తన జీవితాన్ని తానే ప్రశ్నించుకునే వ్యక్తులు కూడా ఉన్నారు. ఈ రోజు యొక్క అసలైన అర్థం అక్కడే దాగి ఉంది. ఆనందోత్సవాల శబ్దం తగ్గిన తర్వాత, మన లోపల వినిపించే ఆ స్వరం "ఈ సంవత్సరం నువ్వు నిజంగా ఏమి సాధించావు?" అనే ప్రశ్నే న్యూ ఇయర్ ఈవ్ యొక్క గుండె.

ఈ రోజు వ్యక్తిగత జీవితాలకే కాదు, సమాజానికి కూడా ఒక అద్దం. సంవత్సరాంతానికి వచ్చేసరికి పాలకులు అభివృద్ధి లెక్కలు చెబుతారు, సంస్థలు విజయ గణాంకాలు చూపిస్తాయి, మార్కెట్లు లాభాల కథలు వినిపిస్తాయి. కానీ ఈ అన్నిటి మధ్య అసలైన ప్రశ్న ఈ ఏడాది సామాన్యుడి జీవితం ఎంతవరకు మారింది? ఉపాధి భద్రత పెరిగిందా? న్యాయం సులభమైందా? బలహీన వర్గాల బాధలు తగ్గాయా? న్యూ ఇయర్ ఈవ్ ఈ ప్రశ్నలను మౌనంగా మన ముందుంచుతుంది. సమాధానాలు సంతృప్తికరంగా లేకపోతే, సంబరాల మధ్య కూడా ఒక అసంతృప్తి గాలిలా తిరుగుతూనే ఉంటుంది.

న్యూ ఇయర్ ఈవ్ మరో ముఖ్యమైన సందేశం ఇస్తుంది %-% మార్పు అనేది ఒక్క రాత్రిలో జరగదు. ఈ రోజు చేసే సంకల్పాలు, రేపటి ఉదయానికి మరచిపోతే, కొత్త సంవత్సరం కూడా పాత సంవత్సరంలాగే మారుతుంది. వ్యక్తిగా మనం మరింత బాధ్యతాయుతంగా మారాలా? సమాజం పట్ల మన పాత్రను తిరిగి నిర్వచించాలా? మన చుట్టూ ఉన్న అన్యాయాలపై మౌనంగా ఉండకుండా ప్రశ్నించాలా? ఈ ఆలోచనలు కార్యరూపం దాల్చినప్పుడే న్యూ ఇయర్ ఈవ్ కి అర్థం వస్తుంది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073